


# A. D. H. M.

నేను ఎస్. ఎస్. ఎల్. సి. చదువుకొనే రోజుల్లో ఒక సంఘటన జరిగింది.

మా క్లాసులో కల్లా ఈశ్వర రావు చాలా అల్లరి చేసేవాడు. ప్రతీ రోజూ లాంగ్ బెల్ అవటంతో మా హెడ్మాష్టరు తిక్క శంకరయ్య (అసలు పేరు శంకర్రావు రెడ్డి) అన్ని క్లాసు ముందర నుంచి నడుస్తూ చెక్ చేస్తూ వెళ్లేవారు. ఆ రోజు ఇంగ్లీషు మాష్టారు 'ఏబౌటెన్-ఏడమ్' స్పెల్లింగ్ పది సార్లు చెప్పారు. పాఠం అయాక చివర ఈశ్వరరావుని "ఏడమ్" స్పెల్లింగ్ చెప్పమన్నారు. ఈశ్వరరావు లేచి ఏడి హెచ్ ఎమ్ (?) అన్నాడు. (హెచ్ కి ఎమ్ కి మధ్య 'ఇ' వదిలేసి.) ఆ సమయాన్నే హెడ్ మాష్టారు మా క్లాసు ముందర నుంచి వెళ్తున్నారు. సడన్‌గా ఆగి పోయారు. ఈశ్వర్రావు అన్న మాట విని ఆశ్చర్య పోయారు. మా క్లాసులో కొచ్చి; "ఈశ్వర రావు ఇలారా" అన్నారు. ఎప్పుడూ హెడ్మాష్టరు తనని పిలవలేదు. ఇవాళ పిలవటంలో ఏదో విశేష ముందని అందర్ని చూస్తూ హెడ్మాష్టర్ దగ్గరకు వచ్చాడు. "ఏరా! ఏడీ హెచ్ ఎమ్? అని అడుగుతున్నావు కదూ? హెచ్ ఎమ్‌ని ఇక్కడే వున్నాన్రా" అన్నాడు చెవి మెలేస్తూ. మాష్టారు అసలు విషయం హెడ్మాష్టరుకి చెప్పి పంపేశారు. తరువాత క్లాసంతా ఈశ్వర రావుతో సహా నవ్వులతో నిండి పోయింది.

—ఎస్. ఎమ్. వాడ్రేవు.

# నేను తియమన్న గోతిలో నేనే పడ్డాను

రామమోహన రావు అప్పు పుచ్చుకో వడమే గాని అప్పు తీర్చేవాడు కాదు. అందువలన ఇతనికి ఎవరూ అప్పు ఇచ్చే వారు కారు. ఏ విధంగానో ఒక సావు కారు వద్ద కొంత డబ్బు అప్పు పుచ్చు కొన్నాడు.

చాలా కాలమయిందిగాని రామ మోహన రావు ఆ సావుకారునకు అప్పు తీర్చలేదు. ఆ సావుకారు డబ్బు అడగ్గా నేను నీకు డబ్బు బాకీగాని నేను అప్పు తీర్చను నీ కిష్టముంటే కోర్టులో దావా వేసుకో అని మొండి కబురు అడాడు. ఇక లాభం లేదని రామ మోహనరావు పై కోర్టులో దావా వేశాడు సావుకారు. రామ మోహన రావు ఒక వకీలు వద్దకు వెళ్ళి సావుకారుకి డబ్బు బాకీవుని అప్పు తీర్చలేనని చెప్పాడు. వకీలు ఒక ఉపాయము చెప్పాడు. కోర్టులో నిన్ను అడిగినా మూగ వానివలె నటించ మన్నాడు. మరునాడు కోర్టుకు వచ్చాడు రామ మోహన రావు. జడ్జి, ఇతనికి ఎంత బాకీవుని యడగ్గా మూగ వానివలె నటించాడు రామ మోహన రావు. ఏ ప్రశ్న యడిగినా మూగ వానివలె నటించాడు. జడ్జి, వీడు మూగవాడు, వీడికి ఎవ రప్పిస్తారు అని కేసు కొట్టి వేశాడు. రామ మోహన రావు బయటకు వచ్చాక వకీలు రామ మోహన రావుని ఫీజు అడిగాడు. వీడు మూగవానివలె నటించాడు. ఎంత అడిగినా మూగ వానివలె నటించాడు. అప్పుడు వకీలు నేను తియమన్న గోతులో నేనే పడ్డాను అని విచారించి వెళ్ళిపోయాడు.

— B. గురునాథ రావు.

# "ఏక కుటుంబమ్"

ట్రయినింగ్ కోర్సుతో టయర్ అయి దానికి లాంగ్ సెల్యూట్ ఒక్కటి పాతేసి మార్నింగ్ నుండి ప్లానింగ్ వేసుకు నుండి పెట్టె-బేడా సర్ది ట్రైన్‌లో జాయిన్ అయి జర్నీచేసి అమాంతంగా మా యూరికి వచ్చి పడ్డాను. మన్మిత్రుడు 'మణి' కూడ సెలవుల్లో వచ్చి యున్నాడు, వాడు హమేషా తమాషాగా కాకుండా సమస్యా రూపకంగా మాట్లాడటం పరిపాటి చేసుకున్నాడు. వాడు కాలేజీలో ఇంటర్ వెలగబెడ్తున్న కాలం అది. ఒకనాడు మే మిరువురము సరదాగా పినాకినీ తరంగిణి వైపు వాహ్యాళికి వెళ్లాము. పిచ్చాపాటిగా ముచ్చటిస్తూ-"ఏరా! కాలేజీ Studies యెలా సాగు తున్నాయిరా"? అనడిగాను.

అందుకు వాడు నోరు తెరుస్తూ-"ఆఁ ఏముంది లెద్దూ! ఈ Arts (కళలు) అన్నీ కాలేజీలలో-యూని వర్శిటీలలో తెలివిలేక యిరికించారు కానీ-యివన్నీ ఒకే కుటుంబ మునకు చెందినవని తెలిసి యేడిస్తేనా!" ముక్తసరిగా అన్నాడు మావాడు అమెరికాను కను గొన్న కొలంబస్‌లా

"ఎట్టా! ఎట్టా!!" అన్నాను నేను.

"ఆఁ! ఏ ముంది! F. A. అంటే Father of Arts.

M. A. అంటే—Mother of Arts.

B. A. అంటే—Brother of Arts.

అంతే! వీళ్లంతా ఒకే కుటుంబమ్ లోని వ్యక్తులేగా! ఔనంటావా! కాదంటావా!! అన్నాడు ఠీవిగా. మాచెలికాని తెలివికి అభినందించకుండా వుండలేక "కదా, మణి!" అన్నాను జోరుగా హోరుమని పోరు సలిపే తరగలవైపు పరికిస్తూ...

—పామిడి "శేశరావ్."